క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



అధినేత జగన్‌ను కలిసిన రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని జీవీఎంసీ 51వ వార్డు కార్పొరేటర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె. రాజుతో కలిసి అధినేతను కలవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



తరుణ్‌ను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: బీహార్ రాష్ట్రం రాజగిరి పట్టణంలో జరిగిన ఖేలో ఇండియా యూత్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థి ప్రతిభ చూపాడు. కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.తరుణ్ 81 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధు కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

రామజోగయ్య శాస్త్రికి సత్కారం



సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రిని సత్కరిస్తున్న వ్యాసశర్మ

అగనంపూడి: సిరివెన్నెల సీతారామశాస్త్రి స్మారక పురస్కారం అందుకోవడానికి విశాఖ విచ్చేసిన సినీగేయ రచయిత రామజోగయ్య శాస్త్రికి విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలిండియా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మాల వ్యాసశర్మ, అనకాపల్లి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్, ప్రతినిధి విశ్వనాథం ఘనంగా సత్కరించారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెదగంట్యాడ: మండలంలోని సిద్దేశ్వరం రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం ఉదయం స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు రావడంతో హోటల్ యాజమాన్యంతో పాటు సిబ్బంది, కొనుగోలుదారులు భయంతో పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపకసిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు స్పందించారు. సకాలంలో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

శానిటరీ సిబ్బందికి పరికరాల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె పంపిణీ చేస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు శానిటరీ సిబ్బందికి సబ్బులు, కొబ్బరినూనె వంటి ఉపకరణాలు పంపిణీ చేశారు. మల్కాపురం శానిటరీ కార్యాలయం వద్ద మంగళవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, నాయకులు మజ్జి సోమేష్,ఉరుకూటి పైడిరాజుయాదవ్ తదితరులు సిబ్బందికి కిట్ రూపంలో అందించారు.





కంచరపాలెం నేతాజీ గ్రంథాలయం వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయని ప్రాంతం

అసంపూర్తి గ్రిల్స్‌తో అవస్థలు



ఐటీఐ కూడలిలో డివైడర్‌పైకి ఎక్కేసిన వాహనం(ఫైల్)



గత నెల కంచరపాలెంలో డివైడర్ ను ఢీ కొట్టిన ఆర్‌టీసీ బస్సు

కంచరపాలెం: ప్రజా రవాణాలో ప్రత్యేకత సంతరించుకునేందుకు, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రతిష్టాత్మకంగా శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ (బీఆర్‌టీఎస్)ను నిర్మించారు. బీఆర్‌టీఎస్‌లో జేఎన్ఎన్ఆర్‌యూఎం బస్సుల కోసం నిర్మించిన ప్రత్యేక రహదారికి, సబ్‌వే మార్గాల్లో కొన్ని చోట్ల మాత్రమే గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కంచరపాలెం కూడలి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు, అటు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ రహదారిలో గ్రిల్స్‌ను అసంపూర్తిగా నిర్మించడంతో ప్రయాణికులకు, పాదాచారులకు ఇబ్బందులు తప్పడంలేదు. నేతాజీ ఫ్లైఓవర్ కూడలి, కంచరపాలెం రైతుబజార్, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, 104 ఏరియా, మద్రిపాలెం, కరాసా ప్రాంతాల్లో గ్రిల్స్ విరిగిపోయి పక్కకుకొరిగిపోవడంతో రోడ్లు దాటేప్పుడు పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బీఆర్‌టీఎస్ మార్గాన సబ్‌వేలోకి వెళ్లేటప్పుడు నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు బీఆర్‌టీఎస్ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు... డివైడర్లను దాటి పాదచారులు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల అదుపు తప్పిన భారీ వాహనాలు రోడ్డుకు ఆనుకుని ఉన్న డివైడర్లను ఢీ కొంటున్నాయి. గ్రిల్స్ లేకపోవడంతో డివైడర్లపైకి వాహనాలు దూసుకొస్తున్నాయని పలువురు వాపోతున్నారు. బీఆర్‌టీఎస్ రహదారులు దాటే సమయంలో పాదచారులు భయాందోళనలతో రాకపోకలు సాగిస్తున్నారు.

తుప్పుపట్టిన గ్రిల్స్

బీఆర్‌టీఎస్ రహదారుల్లో పలు గ్రిల్స్ తుప్పు పట్టాయి. జోన్–5 ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కారిడార్లు మూలకు చేరుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పక్కకు ఒరిగిపోవడంతో స్క్రాప్ దుకాణాలకు చేరుతున్నాయి. మిగిలిన గ్రిల్స్‌కు రంగులు వేస్తే కనీసం కొంత కాలం నిలుస్తాయని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత జోన్–5 జోనల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు స్పందించి గ్రిల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



కంచరపాలెం రైతుబజారు వద్ద డివైడర్ దాటుతున్న పాద చారులు



104 ఏరియాలో రోడ్డున పడి ఉన్న గ్రిల్

గ్రిల్స్ ఏర్పాటు చేయాలి..

బీఆర్‌టీఎస్ రహదారుల్లో రోడ్లు దాటేటప్పుడు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనదారులు అతివేగంతో ప్రయాణం చేసేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన మార్గాల్లో గ్రిల్స్ లేకపోవడంతో ప్రజలు ఇష్టారాజ్యంగా రోడ్లు దాటుతున్నారు. ప్రమాదాల నివారణకు గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలి. అయితే ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లతో సరిపెడుతున్నారు.

– చంద్రశేఖర్, సంకురపేట, ఐటీఐ జంక్షన్

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

కంచరపాలెం నుంచి మద్రిపాలెం వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారుల్లో అసంపూర్తిగా గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. ప్రమాదాల నివారణకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలి.

– పి. రత్నాకర్, వివేకానంద వీధి, కంచరపాలెం

వీధి విక్రయదారుల గుర్తింపు సర్వే

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలో వీధి విక్రయదారుల సర్వే నిర్వహిస్తున్నట్టు జోనల్ కమిషనర్ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధి విక్రదారులకు హాకర్ జోన్స్ ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వెండర్స్ సమస్యలపై 'హాకర్ జోన్స్ ఏవీ?'శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జెడ్సీ శివప్రసాద్ స్పందించారు. జోన్ 3 పరిధిలో ఉన్న వీధి విక్రయదారులు, కొత్త విక్రయదారులు తమ వివరాలను స్థానిక సచివాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ వద్ద ఈనెల 23వ తేదీలోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు వీధి విక్రయదారులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సర్వేలో నమోదు చేసుకున్న వారికి వెండింగ్ కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ అందజేయబడతాయని, ఇవి వీధి విక్రయదారుల గుర్తింపుగా పని చేస్తాయని పేర్కొన్నారు. వీధి విక్రయదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

సీతమ్మధారలో కూలిన చెట్టు



సీతమ్మధార ఏఎంజీ హాస్పిటల్ సమీపంలో కూలిన చెట్టు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద గల ఏఎంజీ హాస్పిటల్ సమీపంలో భారీ చెట్టు కూలింది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఈ చెట్టు కూలింది. రాత్రి సమయం కావడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. పక్కనే ఉన్న బడ్డీ మాత్రం పాక్షికంగా దెబ్బతింది.

హనుమజ్జయంతి ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యనగర్ 2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో మంగళధ్వని వేదమంత్రాలతో ఆలయ అర్చకుడు శ్రీకాంతాచార్యుల పర్యవేక్షణలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అర్చన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, ఋత్విక్వరుణ, మత్స్యంగ్రహణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, హోమాలు, అష్టోత్తర శతకలశ ఆరాధన, తమలపాకులతో అర్చన, సింధూర అర్చన సాంప్రదాయ సిద్ధంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీరామనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, ఆలయ కమిటీ సభ్యుడు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంగీతంతో మమేకమైనది సంస్కృత భాష



కృతులు ఆలపిస్తున్న సంగీత సుధానిధి మండా సుధారాణి

సీతంపేట: తిరుమల తిరుపతి దేవస్థానం, ఎస్వీ కాలేజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, సెంట్రల్ సంస్కృత విశ్వ విద్యాలయం (న్యూఢిల్లీ) సంయుక్తంగా మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'కర్ణాటక సంగీత అనుభవాన్ని ఉన్నతీకరించడంలో సంస్కృత భాష' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, సంగీత సుధానిధి మండా సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై కర్ణాటక సంగీతంలో సంస్కృత భాష ప్రాముఖ్యత గురించి వివరించారు. సంస్కృత భాషలోని పదాలు, వాటి ఉచ్చారణ, అర్థం, భావం సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా పలు త్యాగరాజ, అన్నమయ్య, ముత్తుస్వామి దీక్షితార్ కృతులను ఆలపించి వాటిలో సంస్కృత భాష ఉన్నతిని వివరించారు. ఈ కార్యక్రమంలో హంసా అకాడమీ అధ్యక్షుడు మండా రామప్రసాద్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లలితాపీఠంలో చండీ హోమం



లలితాపీఠంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో వైశాఖ మాసం, బహుళ అష్టమి సందర్భంగా మంగళవారం ఉదయం పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా చండీ హోమం జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసినీ పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోకకల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

22న హనుమాన్ జయంతి..

వైశాఖ బహుళ దశమి సందర్భంగా ఈ నెల 22న హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్టు లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటలకు విశేష అభిషేకం, అర్చన, 10 గంటలకు మన్యుసూక్త సహిత మూల మంత్ర హోమం, సాయంత్రం 6 గంటలకు సహస్ర నామార్చన జరుగుతాయని తెలిపారు.

పూడికలు తొలగించడానికి చర్యలు



ఏకేసీ కాలనీలో గెడ్డను పరిశీలిస్తున్న అధికారులు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ ప్రధాన వైద్యాధికారి (సీఎంహెచ్‌వో) నరేష్‌కుమార్ మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా ఐవోసీ వద్ద గల ప్రధానగెడ్డను పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో రహదారిపైకి మురుగు నీరు వచ్చేస్తుందని గుర్తించారు. దీంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధం వెదజల్లుతుందని, సమస్య పరిష్కరించేందుకు అధికారులకు కొన్ని సూచనలు ఇచ్చారు. అనంతరం ఏకేసీకాలనీ, మరిడిమాంబ కల్యాణమండపం వద్ద ప్రధాన గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా యుద్ధప్రాతిపదికన గెడ్డలో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి చెత్తను ఇష్టానుసారం వేయవద్దని కోరారు. అధికారులు కూడా పారిశుధ్య పనులపై నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–5 ప్రజా ఆరోగ్యశాఖ సహాయ వైద్యాధికారి సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమేష్, డి.రవికుమార్, ఇతర జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

కిషోర బాలికల ఆరోగ్యంపై అవగాహన

గోపాలపట్నం: కిశోర బాలికల మానసిక, శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సెక్టార్ సూపర్‌వైజర్ జేటీఎస్ జ్యోతి అన్నారు. గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలకు లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షతను వ్యతిరేకించాలన్నారు. ఎదిగే పిల్లల్లో పౌష్టికాహార లోపాలు కలిగే అవకాశముందని దాన్ని అధిగమించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ మాధవి, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గార్మెంట్స్ మేకింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (అలీప్) సీతమ్మధార ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సహకారంతో ఈ నెల 23వ తేదీ నుండి మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమర్థ్ కార్యక్రమం క్రింద 18–40 సంవత్సరాల వయసు కలిగి, కనీసం 8 నుండి 10వ తరగతి వరకు చదువుకున్న మహిళలకు ఇండస్ట్రియల్ గార్మెంట్ మేకింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలం ముగిసిన తర్వాత వారికి కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సర్టిఫికెట్లు అందజేసి, ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఈ ఉచిత శిక్షణ తరగతులు మే 23వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. ఈ శిక్షణలో చేరగోరు వారు 63014 41183 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కళాకృతుల తయారీలో శిక్షణ



కళాకృతుల తయారీలో మెలకువలు నేర్పుతున్న అనసూయాదేవి

మల్కాపురం: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం చిన్నారులకు కళాకృతుల తయారీలో ఉచిత శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి పాల్గొని చిన్నారులకు పేపర్‌తో బొమ్మలు,పుష్పాల తయారీలో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల బాలల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె

అక్కిరెడ్డిపాలెం: దేశంలో ఉగ్రదాడులు, కొన్ని రాష్ట్రాల్లో యుద్ధ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సమ్మె జూలై 9కి వాయిదా పడినట్లు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. భెల్ ప్రధాన గేటు ఎదుట మంగళవారం అఖిలపక్షం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణ నిలుపుదల చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26000 చెల్లించాలనే డిమాండ్స్‌తో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి సుభాకర్ సాహూ మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవీఎన్ రాజు, సీతన్నాయుడు, అల్లు అప్పారావు పాల్గొన్నారు.

ట్రాలర్ నుంచి జారిన ఐరన్ షీట్ రోల్



జారిపడ్డ ఐరన్ షీట్ రోల్‌ను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాలర్ లారీ నుంచి మంగళవారం వేకువ జామున ఐరన్ షీట్ రోల్ జారి పడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోకలు సాగకపోవడంతో ప్రమాదం తప్పింది. వివరాలు.. షీలానగర్ నుంచి ఆటోనగర్ లోపలకు ట్రాలర్‌పై ఐరన్ షీట్ రోల్స్ వెళ్తున్నాయి. సరిగ్గా ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి మలుపు తిరుగుతున్న ట్రాలర్‌పై నుంచి రోల్ రోడ్డు మధ్యలో పడిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వెంటనే ఐరన్ షీట్ రోల్‌ను క్రేన్ సహాయంతో తొలగించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరిగింది. రోల్ అవ్వకుండా చైన్‌తో కట్టడం, ఐరన్ బెల్టులతో బిగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ వీటిని తరలించేటప్పుడు కింద రోల్ అవ్వకుండా చెక్కలు, ఇతర దిమ్మలు లాంటి వాటిని తూతూ మంత్రంగా పెట్టి తరలిస్తుంటారు. వీటిపై ట్రాఫిక్ పోలీసులు గట్టి నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

తూనికలు, కొలతల్లో కచ్చితత్వం అవసరం



మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ రాజేష్

సీతంపేట: వరల్డ్ లీగల్ మెట్రాలజీ డే సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జాయింట్ కంట్రోలర్ జి.రాజేష్, డిప్యూటీ కంట్రోలర్ కె.టి.రవి కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూకం, కొలతల్లో కచ్చితత్వం కోసం వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు. కొనుగోలు సమయంలో వస్తు నాణ్యత, వాటి తయారీ, తూనిక, కొలతలు, ఎమ్మార్పీ వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్యాకేజీ రూపంలో ఉండే ఏ వస్తువుకైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర వినియోగదారులు చెల్లించనవసరం లేదన్నారు. వినియోగదారులు ఎలా మోసపోతున్నారు, వ్యాపారులు ఎలా మోసగిస్తారో వివరించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధర డిమాండ్ చేస్తే లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో విశాఖ కన్జ్యూమర్ కౌన్సిల్ చైర్మన్ రామారావు, ఫెడ్కో చైర్మన్ ఎం.సత్యనారాయణ, ఆసరా ఫౌండేషన్ ప్రతినిధి శత్రుఘ్నుడు, అసిస్టెంట్ కంట్రోలర్లు పి.డి.వి.అప్పలరాజు, బి.రామచంద్రయ్య, పి.చిన్నమ్మ, ఇన్స్‌పెక్టర్ వి.రామారావు, ఎస్.ఉమాసుందరి పాల్గొన్నారు.

అనాథ బాలలకు అన్నదానం



అనాథ బాలలకు అన్నం వడ్డిస్తున్న బాలు భార్గవ్

కంచరపాలెం: సినీ నటుడు, నిర్మాత మంచు మనోజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం వైజాగ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బాలు భార్గవ్ ఆధ్వర్యంలో 104 ఏరియాలో కేర్ అండ్ లవ్ అనాథాశ్రమంలో అనాథ బాలలకు అన్నదానం చేసి, నిత్యావసర సరుకులు అందజేశారు. ముందుగా పిల్లల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనాథలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా బాలు భార్గవ్ మాట్లాడుతూ వైజాగ్‌లో ఫ్యాన్స్ వందల సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న విడుదలయ్యే భైరవం సినిమా సూపర్ హిట్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెమినీ గణేష్, దాడి వెంకటేష్, అనిల్, శంకర్, ఎల్లాజీ, పవన్, సతీష్, ప్రసాద్, అభిమాలు పాల్గొన్నారు.

పాజిటివ్ ఆలోచనలతో మానసిక ప్రశాంతత



పాజిటివ్ ఆలోచనలపై ప్రసంగిస్తున్న మూర్తి

మురళీనగర్: సకారాత్మక (పాజిటివ్) ఆలోచనలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా టీచర్ జీఎస్ఎన్ మూర్తి అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంచి ఆలోచనలు కలిగించే పుస్తకాలు చదవాలని ఆయన చెప్పారు. ఆనందం అనేది మన ఆలోచనా దృక్పథంపై ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు. జ్ఞాపకశక్తి, సృజనాత్మకత పెంచే ఆటలు విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు అందించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి కేవీ రమణారెడ్డి, నారాయణరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బోయమాంబ.. చల్లగ చూడమ్మా

కూర్మన్నపాలెం: స్థానిక అప్పికొండకాలనీ గ్రామ దేవత బోయాలమ్మ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పెద్దలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి శ్రీనివాసరావు రమాదేవి దంపతులు అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్.దేముడు, గణపతి, సోమునాయుడు, కాలనీవాసులు పాల్గొన్నారు. వార్డుకు చెందిన మరో నాయకుడు బొడ్డగోవింద్ అమ్మవారిని దర్శించుకున్నారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్ బోయమాంబతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు అరుణకిరణ్, బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.